ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి మెదక్ జిల్లాల వార్తలు

3

బుధవారం 18 సెప్టెంబరు 2024

ఏడుపాయలలో టెండర్లు వాయిదా

పాపన్నపేట, సెప్టెంబరు 17: ఏడుపాయల వనదుర్గా మాత ఆలయంలో షాపులకు మంగళవారం నిర్వహించాల్సిన టెండర్లు వాయిదా వేసినట్లు ఈవో చంద్రశేఖర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. దేవస్థానానికి చెందిన 9 దుకాణాల్లో చట్టబద్ధమైన వ్యాపారం నిర్వహించడానికి, మొబైల్ ఫొటోలు తీయడానికి, తలనీలాలు పోగుచేయడానికి సీల్డ్ మరియు బహిరంగ వేలాలు నిర్వహించనున్నట్లు ఈ నెల 2న పత్రికాప్రకటన చేశామని పేర్కొన్నారు. అనివార్య కారణాల వల్ల ఆ టెండర్లు వాయిదా వేశామని తెలియజేశారు.

స్మార్ట్ ఫోన్ కొనుక్కో.. వాట్సాప్‌లో చాటింగ్ చెయ్!

- పొద్దున ఆరున్నరకే మా ఇంటికి రావాలి
- రాత్రి 8.30 దాకా ఆఫీసులో పనిచేయాలి
- లేదంటే డిప్యూటేషన్‌పై హైదరాబాద్‌కు పంపుతా
- సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఉద్యోగినికి బాస్ వేధింపులు
- కలెక్టర్‌కు మొరపెట్టుకున్న బాధితురాలు

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 17: "స్మార్ట్ ఫోన్ కొనుక్కో.. వాట్సాప్‌లో చాటింగ్ చెయ్. పొద్దున 6.30గంటల కల్లా మా ఇంటికి రావాలి. రాత్రి 8.30గంటల దాకా ఆఫీసులో పనిచేయాలి. లేకపోతే నిన్ను హైదరాబాద్‌కు డిప్యూటేషన్‌పై పంపుతా.." సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఓ శాఖాధిపతి తన కింద పనిచేసే మహిళా ఉద్యోగిని వేధిస్తున్న తీరు ఇది. వేధింపులను భరించలేక సదరు ఉద్యోగిని కలెక్టర్ వల్లూరు క్రాంతికి ఫిర్యాదు చేశారు. బాధిత మహిళ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఓ శాఖ జిల్లా కార్యాలయంలో సదరు ఉద్యోగిని ఆఫీస్ సబార్డినేట్‌గా 20 ఏళ్లుగా పనిచేస్తున్నారు. భర్త చనిపోవడంతో ఆమె కారుణ్య నియామకం కింద ఉద్యోగంలో చేరారు. ఆమెకు బుద్ధి మాంద్యం ఉన్న ఇద్దరు కుమారులు, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు ఉన్నారు. ఇంటి దగ్గర వారందరి ఆలనాపాలనా చూసుకుంటూ ఆమె ఉద్యోగ విధులను నిర్వహిస్తున్నారు. అయితే, ఆ ఉద్యోగినిని సదరు శాఖ జిల్లా అధికారి ఏదో ఒక వంకతో ఇబ్బందులకు గురి చేస్తున్నారు. సెలవులు ఇవ్వకుండా వేధిస్తున్నారు. ఆఫీసులో ఆమెతో పాటు ముగ్గురు పురుషులు ఆఫీస్ సబార్డినేట్‌లుగా పనిచేస్తున్నా.. ప్రతి రోజు తెల్లవారుజామునే ఆఫీసుకు వెళ్లి పేపర్ క్లిప్పింగ్‌లను కట్ చేసి తన ఇంటికి తీసుకురావాలని, మరో జత క్లిప్పింగ్‌లను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఇచ్చి రావాలని సదరు బాస్ ఆ మహిళను వేధిస్తున్నారు. "నేను చెప్పినట్లు చేస్తేనే ఇక్కడ పనిచేయాలి. లేకుంటే మరిన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుంది" అంటూ బెదిరిస్తున్నాడు. ఈ విషయాలన్నింటి బాధిత ఉద్యోగిని కలెక్టర్ ఎదుట మొరపెట్టుకున్నారు. కార్యాలయంలో తనకు రక్షణ కల్పించి, జిల్లా అధికారి వేధింపుల నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేశారు.





బై బై గణేశా..

ఘనంగా నిమజ్జన వేడుకలు.. శోభాయాత్రలు

మండపాల్లో తొమ్మిది రోజులు పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో గణేష్ నిమజ్జనోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గణపతి బప్పా మోరియా.. బై బోలో గణేశ్ మహరాజ్‌కీ జై అంటూ భక్తులు జయజయధ్వానాలతో హోరెత్తించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో విగ్రహాలనలు ఊరేగిస్తూ.. కన్నుల పండువగా శోభయాత్రలు నిర్వహించారు. దారి పొడవునా మహిళలు మంగళహారతులతో గణనాథుడికి స్వాగతం పలుకగా.. డప్పుచప్పుళ్లు కోలాటాలతో చిన్నా పెద్దా నృత్యాలు చేస్తూ ముందకు సాగారు. అనంతరం సమీపంలోని చెరువులు కుంటల్లో నిమజ్జనం చేసి గణపయ్యా సెలవయ్యా అంటూ సాగనంపారు.

-మెదక్ అర్బన్/ సంగారెడ్డిరూరల్



చాకరిమెట్లలో ఎడ్లబండిపై గణనాథుడి ఊరేగింపు



సంగారెడ్డిలో యువతుల ఉత్సాహం..



డప్పు కళాకారుల విన్యాసాలు



సంగారెడ్డిలో గంగమ్మ ఒడికి చేరుతున్న గణనాథుడు



వినాయక మండపాల్లో హరీశ్‌రావు పూజలు

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని వినాయక విగ్రహాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డితో కలిసి దర్శించుకున్నారు. కోలిగడ్డలోని నేతాజీ యువజన సంఘం, నేతాజీ గణేష్ మండలి, 13వ వార్డులోని గణపతుల వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం రైతు సమన్వయ కమిటీ మెదక్ జిల్లా అధ్యక్షుడు తాడెపు సోములు సోదరుడు సుధాకర్ ఇటీవలే మృతిచెందడంతో వారి కుటుంబాన్ని, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు తల్లి గంగమ్మ మృతిచెందడంతో వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

-మెదక్ మున్సిపాలిటీ



జహీరాబాద్‌లో శోభాయాత్రలో దాండియా ఆడుతున్న మహిళలు

అమరుల త్యాగాలతోనే
కల సాకారం

ప్రజాసంక్షేమమే ప్రాధాన్యంగా పాలన
వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 17 : ఎందరో అమరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కల సాకారమయిందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన ప్రజాపాలన దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు. అంతకుముందు అమరువీరుల స్తూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానం భారత దేశంలో విలీనమైన సెప్టెంబర్ 17వ తేదీ తెలంగాణ చరిత్రలోనే కీలకమైనదని పేర్కొన్నారు. 1948 సెప్టెంబరు 13న ఆనాటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో ఆపరేషన్ పోలో చేపట్టడంతోనే 17న నిజాం నవాబు లొంగుబాటు ప్రకటన చేశారని గుర్తుచేశారు.

స్వరాష్ట్రం కోసం సుదీర్ఘ పోరాటం

తెలంగాణ రాష్ట్ర కల సాకారం చేసుకోవడానికి ప్రజలు సుదీర్ఘ కాలం పోరాటం చేశారని గుర్తుచేశారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఆత్మగౌరవ నినాదంతో 1969 నుంచి పలు దశల్లో పోరాడారని పేర్కొన్నారు. ఎంతోమంది ప్రాణ త్యాగాలతో 2014 జూన్ 2న ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కల సాకారం చేసుకున్నామన్నారు. ప్రజలు కోరుకున్నట్టే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తమ ప్రభుత్వ పాలన సాగుతున్నదని పేర్కొన్నారు. ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను దశలవారీగా అమలుచేసి ప్రజల మన్ననలు పొందుతున్నామని తెలిపారు. అర్హులందరికీ పథకాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంకితభావమే దేశసేవ : ఎస్పీ

సంగారెడ్డి క్రైం : అంకితభావంతో విధులు నిర్వర్తించమే నిజమైన దేశసేవ అని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఆయన జాతీయ జెండాను ఎగురవేశారు. ఉద్యోగంలో చేరిన మొదటి రోజు నుంచి చివరి వరకు ప్రజలకు సేవ చేయాలనే ఉత్సాహాన్ని కొనసాగించాలన్నారు.





మాట్లాడుతున్న మంత్రి దామోదర్



ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

సంక్షేమ పథకాల అమలులో
తెలంగాణ నంబర్‌వన్

- ఏక కాలంలో రైతు రుణాలుమాఫీ
- వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి
- మెదక్ కలెక్టరేట్‌లో ఘనంగా ప్రజాపాలన వేడుకలు



మెదక్‌లో జెండాకు సెల్యూట్ చేస్తున్న కోదండరెడ్డి, కలెక్టర్, ఎస్పీ

మెదక్, సెప్టెంబరు 17: ఎందరో యోధుల పోరాటం, త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి పేర్కొన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలు, జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభాయి పటేల్ చొరవతోనే నిజాం సంస్థానం భారతదేశంలో విలీనమైందని గుర్తుచేశారు. అదే పోరాట స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే నంబర్‌వన్‌గా నిలుస్తున్నదని చెప్పారు. రైతు రుణమాఫీతో రైతులకు భరోసా కల్పించామని వివరించారు. మెదక్ జిల్లాలో 86,919 మంది రైతులకు రూ. 638 కోట్ల రుణాలు ఏక కాలంలో మాఫీ చేసినట్లు వివరించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.10 లక్షలకు పెంచి అమలుచేస్తున్నామని తెలిపారు. ఈ పథకం ద్వారా జిల్లాలో పది నెలల్లోనే 10,722 మంది పేదలకు వైద్య చికిత్స కోసం ప్రభుత్వం రూ.25.6 లక్షలు మంజూరు చేసిందని పేర్కొన్నారు. నిరుపేదల సొంతింటి కల సాకారం చేయడానిని రాష్ట్రంలో ఒక్క సంవత్సరంలోనే 4.50 లక్షల గృహాలు నిర్మించ తలపెట్టినట్లు తెలిపారు. ప్రతీ నియోజకవర్గంలో 3,500 ఇళ్లు నిర్మిస్తామని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం కింద రూ.500కువంటగ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకూ 1,22,672 మంది వినియోగదారులకు 2,53,125 గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.7.18 కోట్ల సబ్సిడీ అందజేసిందని తెలిపారు. గృహజ్యోతి కార్యక్రమం ద్వారా 200 యూనిట్ల లోపు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 1,04370 వినియోగదారులకు జీరో బిల్లులు ఇచ్చేందుకు ప్రభుత్వం రూ.23.54 కోట్ల సబ్సిడీ అందజేసిందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ ఉదయ్‌కుమార్, అదనపు ఎస్పీ మహేందర్, ఆర్డీవో రమాదేవి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ఉత్సవాలు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 17: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ సందర్భంగా మంగళవారం జిలా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. మెదక్‌లోని కార్యాలయంలో ఆర్డీవో రమాదేవి, టీఎన్జీవో భవన్ వద్ద జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ జాతీయ జెండాను ఎగురవేశారు.



కౌడిపల్లి దవాఖానాలో సిబ్బంది హాజరును పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

రోగులను నిల్చోబెట్టి ఇంజక్షన్ ఇవ్వడమేంటి?

- విధులను నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదు
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ హెచ్చరిక
- కౌడిపల్లి సీహెచ్‌సీలో ముగ్గురు ఉద్యోగుల సస్పెన్షన్, వైద్యాధికారికి మెమో

కౌడిపల్లి/మెదక్ కల్చరల్, సెప్టెంబరు 17: ఆస్పత్రికి వచ్చే రోగులను నిల్చోబెట్టి ఇంజక్షన్ ఇవ్వడమేంటని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండల పరిధిలోని సీహెచ్‌సీ, పీహెచ్‌సీని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి వైద్యసేవల గురించి ఆరాతీశారు. నిల్చోబెట్టి ఇంజక్షన్ ఇస్తున్నారని, టెస్టుల పేరుతో ప్రైవేట్ ఆస్పత్రికి పంపుతున్నారని రోగులు ఫిర్యాదు చేయడంతో సిబ్బందిపై మండిపడ్డారు. ఆస్పత్రికి రోగులు వస్తేనే సిబ్బంది ఉద్యోగాలు ఉంటాయని హెచ్చరించారు. ఆస్పత్రికి వచ్చిన ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యసేవలు అందించాలని స్పష్టం చేశారు. విధులను నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

సంతకం పెట్టి గైర్హాజరైన ముగ్గురిపై వేటు

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కౌడిపల్లి సీహెచ్‌సీ సిబ్బందిపై కలెక్టర్ వేటు వేశారు. హాజరుపట్టికలో సంతకాలు చేసి విధులకు గైర్హాజరైన మల్టీపర్పస్ హెల్త్‌అసిస్టెంట్స్ కె.రమేష్, రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఈవో అబ్దుల్ షకీల్‌ను సస్పెండ్ చేయడంతో పాటు వైద్యాధికారికి మెమో ఇస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

రోజుకో అవతారంతో కొట్టేస్తున్నారు..
పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు
5లో

'కాకతీయుల శిలాశాసనాన్ని పరిరక్షించండి'

సంగారెడ్డి రూరల్‌: కొండాపూర్‌ మండం మారేపల్లిలోని కాకతీయుల కాలం నాటి శిలాశాసనాన్ని పరిరక్షించాలని గ్రామానికి చెందిన హన్మకొండ జంగయ్య మంగళవారం సంగారెడ్డి కలెక్టర్‌ వల్లూరు క్రాంతికి వినతి పత్రం అందజేశారు.

'దేశం కోసం, ధర్మం కోసం బీజేపీ కృషి'

జహీరాబాద్‌, సెప్టెంబరు 17: బీజేపీ ప్రభుత్వం దేశం కోసం, ధర్మం కోసం పనిచేస్తుందని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశమే పరమావధిగా ప్రధాని మోదీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సేవాపక్వాడ పేరుతో బీజేపీ ఆధ్వర్యంలో 17 నుంచి అక్టోబరు 2 వరకు సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, నియోజకవర్గం, మండల స్థాయి నాయకులు జైపాల్‌రెడ్డి, నౌబాద్‌జగన్‌, గొల్లభాస్కర్‌ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందే బీఆర్‌ఎస్‌

● కాంగ్రెస్‌ కిసాన్‌ సెల్‌ జిల్లా అధ్యక్షుడు పబ్బతి ప్రభాకర్‌రెడ్డి

మెదక్‌ అర్బన్‌, సెప్టెంబరు 17: తెలంగాణను అప్పులపాలు చేసిందే బీఆర్‌ఎస్‌ అని, మాట్లాడే నైతిక హక్కు హరీశ్‌రావుకు లేదని కాంగ్రెస్‌ కిసాన్‌ సెల్‌ జిల్లా అధ్యక్షుడు పబ్బతి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మిగులు రాష్ట్రంగా సోనియాగాంధీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇస్తే.. ధనిక తెలంగాణ అంటూ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి ప్రజలను మోసం చేశారన్నారు. బీఆర్‌ఎస్‌ అధికారంలో ఉండగా.. బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. కేసీఆర్‌ పాలనలో వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. హరీశ్‌రావు మెదక్‌ జిల్లాను దివాళా తీయించారని, ఏం ఉందని మెదక్‌ వచ్చి మాట్లాడుతున్నావంటూ మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి వాస్తవాలను ప్రజల ముందు పెడుతుంటే హరీశ్‌రావు ఎందుకు ఉక్కిలి పడుతున్నాడంటూ ఎద్దేశా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన నడుస్తోందన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం తొమ్మిదినెలల కాలంలో అనేక హామీలను అమలు చేసిందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్‌ ఛైర్మన్‌ చంద్రపాల్‌, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు హఫీజొద్దీన్‌, సీనియర్‌ నాయకులు శ్రీనివాస్‌చౌదరి, బొజ్జ పవన్‌, అశోక్‌రెడ్డి, నాగిరెడ్డి, శంకర్‌, యూత్‌ కాంగ్రెస్‌ నేత భరత్‌గౌడ్‌, తదితరులు పాల్గొన్నారు.

వాహనానికి సైడ్‌ ఇచ్చే క్రమంలో వాగ్వాదం

●ఆటోడ్రైవర్‌ ఆత్మహత్యాయత్నం



గాయాలతో ఆటోడ్రైవర్‌ విఠల్‌

హత్నూర, సెప్టెంబరు 17: వాహనానికి సైడ్‌ ఇచ్చే క్రమంలో వాగ్వాదం జరగడంతో ఆటోడ్రైవర్‌ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర పోలీ‌స్‌స్టేషన్‌ ఆవరణలో మంగళవారం సాయంత్రం జరిగింది. మల్కాపూర్‌కు చెందిన ఆటోడ్రైవర్‌ పటేల్‌ విఠల్‌గౌడ్‌ దౌల్తాబాద్‌ నుంచి ప్రయాణికులతో సంగారెడ్డి వైపు బయలుదేరాడు. మల్కాపూర్‌ గ్రామ శివారులోని ఇండియన్‌ పెట్రోల్‌ పంపు సమీపంలోకి చేరుకోగానే, వెనకనుంచి వచ్చిన గజ్వేల్‌-ప్రజ్ఞాపూర్‌ డిపోకు చెందిన బస్సు డ్రైవర్‌ పదేపదే హారన్‌ కొడుతుండడంతో అసహనానికి గురైన విఠల్‌గౌడ్‌ రోడ్డుపై ఆటో నిలిపి.. ముందు వాహనాలు ఉండగా సైడ్‌ ఎలా ఇచ్చేదని ప్రశ్నించారు. దీంతో ఆర్టీసీ డ్రైవర్‌ కూడా బస్సును రోడ్డుపై ఆపి కిందకు దిగడంతో ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకున్నది. సంగారెడ్డి-నర్సాపూర్‌ ప్రధాన రహదారిపై భారీగా నిలిచిపోవడంతో, వాహనదారులు పోలీసులకు సమాచారమందించారు. వారు వచ్చి ఆర్టీసీ బస్సు ఆటోతో పాటు ఇద్దరు డ్రైవర్లను హత్నూర పోలీ‌స్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడికి వెళ్లగానే పోలీసులు ఆటోడ్రైవర్‌ ఫోన్‌ తీసుకున్నారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ అనిల్‌ రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తుండగా, విఠల్‌గౌడ్‌ తనవెంట తెచ్చుకున్న కిరోసిన్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. పోలీసులు అతడిపై నీళ్లు చల్లి మంటలానుఆర్పి.. చికిత్స నిమిత్తం నర్సాపూర్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు బాధితుడి కుటుంబీకులు తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్‌ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి జైలుకు పంపితే 20 ఏళ్ల వరకు బయటకు రావని పోలీసులు భయభ్రాంతులకు గురిచేయడంతో చనిపోవాలనుకున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదిలా ఉండగా ఆర్టీసీ డ్రైవర్‌ ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేస్తున్నామని, ఎవరినీ బెదిరించలేదని ఎస్‌ఐ సుభాష్‌ స్పష్టం చేశారు.

అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

● కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్



చిట్కుల్‌లో ప్రజాపాలన దినోత్సవంలో కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్

పటాన్‌చెరు, సెప్టెంబరు 17: అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిట్కుల్‌లో ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన జాతీయ పతాకావిష్కరణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ఆనాడు రాచరిక సంకెళ్లను తెంచుకోవడం కోసం జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఎందరో అమరులయ్యారన్నారు. ఆనాటి త్యాగాలు, పోరాటల స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలు కాపాడుతూ జనరంజక పాలన సాగిస్తున్నదన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో బాలశౌరి, ఈవో కవిత, నాయకులు నారాయణరెడ్డి, వెంకటేశ్, నారాయణ, మురళి, శ్రీను, గోపాల్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో కళాశాల, పాఠశాల సిబ్బంది

నర్సాపూర్, సెప్టెంబరు 17: జూనియర్ బేస్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు నర్సాపూర్ గిరిజన గురుకుల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ బలరాం, పాఠశాల ప్రిన్సిపాల్ రవి, పీడీ లక్ష్మణ్ తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు నిర్మల్‌లో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ చాంపియన్‌షిప్‌లో ఉత్తమ ప్రదర్శన కనబర్చడంతో ఎంపిక చేసినట్లు తెలిపారు. అక్టోబరు 1 నుంచి 6వ తేదీ వరకు పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

ధరాఘాతం



● కిలో వెల్లుల్లి రూ.300పైనే
● ఉల్లి ధర కిలో రూ.60
● వంటనూనెలదీ అదేదారి..
● కొనలేనిస్థితిలో సామాన్యులు

దౌల్తాబాద్, సెప్టెంబరు 17: వంటింట్లో నిత్యావసర ధరల మంటలు భగ్గుమంటున్నాయి. ప్రజలు ఉపయోగించే నిత్యావసరాల ధరలు నెల రోజుల క్రితంతో పోలిస్తే ప్రస్తుతం రెండింతలు పెరిగాయి. గత నెలలో ఉల్లిగడ్డ కిలో రూ.20 నుంచి రూ.30 వరకు ఉండగా ప్రస్తుతం రూ.50 నుంచి రూ.70 వరకు పెరిగింది. అదేవిధంగా వెల్లుల్లి ధర గత నెలలో కిలో రూ.180 నుంచి రూ.200 వరకు ఉండగా ప్రస్తుతం రూ.300 పైననే ధర పలుకుతుంది . నెల రోజులలోనే నిత్యావసర ధరలు ఆకాశాన్నంటడంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు.

పంటలు దెబ్బతినడమే కారణం..

ఉల్లి, వెల్లుల్లి ధరలు నెల రోజుల వ్యవధిలోనే రెండింతలు పెరగడానికి కారణం కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు తెలంగాణ, ఆంధ్రరాష్ట్రాల్లో వర్షాలకు ఆయా పంటలు దెబ్బతినడమే కారణంగా వ్యాపారులు చెబుతున్నారు. ఆగస్టు నుంచి గత వారం క్రితం వరకు కూడా పెద్ద ఎత్తున వర్షాలు కురిసి వరదల కారణంగా ఉల్లి గడ్డ,వెల్లుల్లి పంటలు దెబ్బతిన్నాయి. దీంతో మన రాష్ట్రాలకు సరఫరా కావాల్సిన ఉల్లి గడ్డ, వెల్లుల్లి తగ్గిపోవడంతో ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు.

వంట నూనె ధరలకూ రెక్కలు..

కేంద్ర ప్రభుత్వం ఇటీవల సన్‌ఫ్లవర్, పామాయిల్‌పై జీఎస్టీని పెంచడంతో మూడు రాజులుగా వాటి ధరలు కూడా భారీగా పెరిగిపోయాయి. సన్‌ఫ్లవర్ నూనె మూడు రోజుల కిందట కిలో ప్యాకెట్ ధర రూ.110 ఉండగా ప్రస్తుతం రూ.130కి చేరుకుంది. పామాయిల్ ధర రూ.95 ఉండగా ప్రస్తుతం రూ.120కి చేరింది. వీటితోపాటు క్వింటాల్ సన్న బియ్యం ధర ఏకంగా రూ.6 వేల పైననే పలుకుతున్నది. ప్రభుత్వం వెంటనే స్పందించి పెరిగిన నిత్యావసరాల ధరలను తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

మరింత పెరిగే అవకాశం ఉంది..



నెల రోజుల వ్యవధిలోనే ఉల్లి, వెల్లుల్లి ధరలు రెండింతలు పెరిగాయి. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని పెంచిన కారణంగా మూడు రోజుల నుంచి పామాయిల్, సన్‌ఫ్లవర్ నూనెల ధరలు ఆకాశాన్నంటాయి. వర్షాలు కురిసి పంటలు దెబ్బతినడంతో ధరలు పెరిగాయి. రానున్న రోజులు మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

-పంచామి స్వామి,
సూపర్ మార్కెట్ వ్యాపారి, దౌల్తాబాద్ మండలం

సామాన్యులు కొనలేని పరిస్థితి..

ఇప్పుడున్న ధరలు చూస్తే ఏమీ కొనలేని సపరిస్థితి నెలకొంది. ఉల్లిగడ్డ, వెలుల్లిగడ్డ ధరలు మండిపోతున్నాయి. ఇంత ధరలు ఎన్నడూ చూడలేదు. నూనె ధరలు కూడా పెరగడంతో పేదలందరూ అవస్థలు పడుతున్నారు. ధరలు నియంత్రిచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. లేకపోతే సామాన్య ప్రజలకు పచ్చడి మెతుకులతోనే కాలం వెల్లదీయాల్సి ఉంటుంది.

-గడ్డమీది శేఖర్‌గౌడ్
దొమ్మాట,హోటల్ యజమాని ,దౌల్తాబాద్ మండలం

తెలంగాణ విమోచనంపై కాంగ్రెస్ ద్వంద్వ నీతి

● బీజేపీ అధికారంలోకి రాగానే తెలంగాణ విమోచన దినం అధికారికంగా నిర్వహిస్తాం
● మెదక్ ఎంపీ రఘునందన్ రావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 17: తెలంగాణ విమోచన దినోత్సవంపై కాంగ్రెస్ ద్వంద్వం నీతి ప్రదర్శిస్తుందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం పురస్కరించుకుని మంగళవారం సిద్దిపేటలోని ఎస్‌ఎస్‌వీ బ్లడ్ బ్యాంకులో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నీలం దినేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ విమోచన దినోత్సవాన్ని కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తే తెలంగాణలో ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. మహారాష్ట్ర ప్రభుత్వం జాతీయ జెండా ఎగురవేసి విమోచన దినోత్సవం జరిపిందన్నారు. కాంగ్రెస్‌కు విమోచన దినోత్సవంపై ఒకే స్టాండ్ ఉంటే రెండు రాష్ట్రాల్లో అలా ఎందుకు జరుపుతుందని నిలదీశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే విమోచన దినం అధికారికంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విద్యాసాగర్, అంబటి బాలేష్‌గౌడ్, నాయకులు చింత సంతోష్, ఉపేందర్‌రావు, విభీషణ్‌రెడ్డి, సురేష్‌గౌడ్, కానుగంటి శ్రీనివాస్, కొత్తపల్లి వేణుగోపాల్, బాసంగారి వెంకట్, గోనె మార్కండేయులు, తొడుపునూరి వెంకటేశం, సంతోష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ.. రూ.లక్షల్లో..

● పోటాపోటీగా వేలం
● మారుమూల గ్రామాల్లోనూ లక్షలు పలికిన ధర
● అశోక్‌నగర్‌లో రూ.7.8 లక్షలకు సత్యనారాయణ కైవసం



అశోక్‌నగర్ గణేశ్ లడ్డూను దక్కించుకున్న సత్యనారాయణ

రామచంద్రాపురం/సెప్టెంబరు 17: :సెప్టెంబరు 17 : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గణనాథుడి లడ్డూ వేలంలో రూ.లక్షల్లో ధర పలికింది. పలు ప్రాంతాల్లో లడ్డూను దక్కించుకునేందుకు భకక్తులు పోటీపడ్డారు. రామచంద్రాపురం మండలంలోని అశోక్‌నగర్‌లోని ఆలయం వద్ద జరిగిన వేలంలో లడ్డూను భవానిపురానికి చెందిన సత్యనారాయణ రూ.7.80లక్షలకు దక్కించుకున్నారు. ఈదులనాగులపల్లిలోని లిటిల్ స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను కాల్వగడ్డ రాజ్‌కుమార్ రూ.3.67 లక్షలకు దక్కించుకున్నారు. పట్టణంలోని రామచంద్రారెడ్డినగర్‌లో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద జనరల్ లడ్డూని రూ.2.21 లక్షలకు పి.వెంకట్‌రెడ్డి, మహిళా లడ్డూను తాళ్ల పద్మకుమార్‌గౌడ్ దక్కించుకున్నారు.

నారాయణఖేడ్ మండలంలో

మండలంలోని పంచగామ కాశీనాథ్ బాబా ఆశ్రమం ఆవరణలో ప్రతిష్ఠించిన గణనాథుడి లడ్డూను కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పరిధిలోని మాచరెడ్డికి చెందిన రంగ సంగమేశ్వర్‌గౌడ్ కుటుంబ సభ్యులు రూ.4.26 లక్షలకు సొంతం చేసుకున్నారు. పట్టణంలోని భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మొదటి లడ్డూను వ్యాపారి మోహన్ రూ.2.05 లక్షలకు, రెండవ లడ్డూను అశోక్ యాదవ్ 1.16లక్షలకు దక్కించుకున్నాడు. అలాగే హిందువాహిని మొదటి లడ్డూను సారంగ్ వినయ్ రూ.1.62 లక్షలకు దక్కించుకున్నారు. ఇక నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలో శివాజీదల్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి లడ్డూను వ్యాపారి బీఎస్ వీరశెట్టి రూ.1.55 లక్షలకు దక్కించుకున్నారు.

చిన్నగొట్టిముక్ల గ్రామంలో.. రూ.3.50లక్షలు..

శివ్వంపేట, సెప్టెంబరు 17: మండల పరిధిలోని చిన్నగొట్టిముక్లలో గ్రామంలోని గణనాథుడి లడ్డూను బీఆర్ఎస్ సీనియర్ నేత సింగయ్యపల్లి గోపి రూ.3.50 లలకు దక్కించుకున్నాడు.

బాలికపై అత్యాచారం

● నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు

రామచంద్రాపురం, సెప్టెంబరు 17: బాలిక(7)పై బాలుడు(17) అత్యాచారానికి పాల్పడిన సంఘటన సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం పట్టణంలో నివాసముంటున్న బాలుడు(17) చదువు మానేసి జులాయిగా తిరుగుతున్నాడు. సదరు బాలుడి ఇంటి పక్కనే ఉంటున్న బాలిక(7)పై సోమవారం అత్యాచారానికి తెగబడ్డాడు. తీవ్ర రక్తస్రావంతో గాయాలపాలైన బాలిక విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో బాలిక తల్లిదండ్రులు మంగళవారం రామచంద్రాపురం పోలీసులకు పిర్యాదు చేశారు. బాలుడిని అదుపులోకి తీసుకుని, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

ఆరోగ్య శ్రీ సేవలు బంద్ !

● నేటి నుంచి ఉద్యోగుల నిరవధిక సమ్మె

సంగారెడ్డి అర్బన్/మెదక్ కల్చరల్, సెప్టెంబరు 17 : రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద పనిచేస్తున్న ఆరోగ్యశ్రీ ఉద్యోగులు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని గత నెల 20 నుంచి నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించినా, సమ్మె నోటీసు ఇచ్చి 42 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో సమ్మెకు నిర్ణయించారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 46 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. నిరవధిక సమ్మెలోకి వెళ్తే ఆరోగ్య శ్రీ పథకం ద్వారా వైద్య సేవలు పొందేందుకు వచ్చే రోగులకు ఇబ్బందులు ఎదురుకానున్నాయి. నిరవధిక సమ్మెకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు హిమగిరి ప్రసాద్ కోరారు.

ఆస్తి కోసం తండ్రి హత్య



మారుతి(ఫైల్)

ఝరాసంగం, సెప్టెంబరు 17: ఆస్తి కోసం కన్న తండ్రిని తనయుడు దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దీపూర్ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకున్నది. స్థానిక ఎస్ఐ నరేష్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మారుతి(75)కి నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నది. అందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. అయితే మారుతికి కుప్పానగర్ గ్రామ శివారులోని 137 సర్వే నంబరులో 35 గుంటల భూమి ఉన్నది. ఈ భూమిని తన పేరున చేయాలని రెండో కుమారుడు శ్రీనివాస్ మూడునెలలుగా తండ్రిని వేధిస్తున్నాడు. కాగా రోజు మాదిరిగానే మారుతి వ్యవసాయ పొలం వద్ద కాపలా ఉండి గట్టుపై నిద్రిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న శ్రీనివాస్ తాగిన మైకంలో అక్కడికి వెళ్లి బండరాయితో మారుతిని బలంగా మోది హత్య చేశాడు. పెద్ద కుమారుడు నర్సింహులు ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మృతదేహానికి జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అప్పులు తీర్చే మార్గం లేక వ్యక్తి ఆత్మహత్య



నర్సింహులు మృతదేహం

మద్దూరు, సెప్టెంబరు 17 : అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ షేక్ మహబూబ్ కథనం ప్రకారం మండలంలోని లద్నూరు గ్రామానికి చెందిన కర్రె నర్సింహులు(50) కూలీకి వెళ్లి జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో చిన్న కూతురు వివాహానికి ఇంటిపై రూ.3.50లక్షల ఫైనాన్స్ తీసుకున్నాడు. రోజూ కూలీతో వచ్చే డబ్బులతో అప్పు తీరకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంటి ఎదుట ఉన్న సజ్జ కొండికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య కర్రె కనకవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్య అలిగి పుట్టింటికి పోయిందని భర్త..

తూప్రాన్, సెప్టెంబరు 17: గొడవపడి భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం తూప్రాన్ పట్టణంలో నివాసముండే కడమంచి గణేష్ (26) ఈ నెల 9న భార్యతో సంసారం విషయంలో గొడవపడ్డాడు. దీంతో భార్య అలిగి పుట్టింటికి వెళ్లిపోగా.. మనస్తాపానికి గురైన గణేష్ అదే రోజు రాత్రి టాయిలెట్లు శుభ్రం చేసే కెమికల్‌ను తాగడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో అతడిని కుటుంబీకులు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బులకు కోసం వెళ్లిన వ్యక్తి శవమై..

● అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



నర్సింహులు(ఫైల్)

మెదక్ కల్చరల్, సెప్టెంబరు 17: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మెదక్ మండలం కొంటూర్ గ్రామ శివారులో మంగళవారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం మెదక్ మండలం మక్తా భూపతిపూర్ గ్రామానికి చెందిన మంగలి నర్సింహులు(40) సోమవారం సాయంత్రం చిన్నశంకరంపేట వెంకటాయపల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి దగ్గరకు డబ్బుల కోసం వెళ్లాడు. దీంతో ఆ వ్యక్తి రూ.40 వేలు ఇచ్చి కొంటూర్ వద్ద దింపి వెళ్లగా.. అక్కడే ఉన్న ఇద్దరు వ్యక్తులు అతడిని బైకుపై తీసుకెళ్లినట్లు సదరు వ్యక్తి తెలిపాడు. కాగా, మంగళవారం ఉదయం కొంటూర్ చెరువు ఆవరణ ముళ్ల పొదల పక్కన నర్సింహులు మృతదేహం లభ్యమైంది. అక్కడికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై మురళి తెలిపారు.

అనుమానాస్పద స్థితి మృతిపై కేసు..



బాల్‌రాజ్(ఫైల్)

కల్హేర్, సెప్టెంబరు 17: మండల పరిధిలోని బీబీపేట్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన మంగళి బాల్‌రాజ్(38) సోమవారం రాత్రి బైకుపై నుంచి పడి మరణించగా స్థానికులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే మృతదేహాన్ని పరిశీలించిన కల్హేర్ పోలీసులు రోడ్డు ప్రమాదంలో మరణించినట్లు లేదని అనుమానించారు. భార్య మంగళి శివలీల ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతి కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశం తెలిపారు. మృతుడు బాల్‌రాజ్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జర్నలిస్టు సూర్యప్రకాశ్‌కు అండగా మంత్రి దామోదర రాజనర్సింహ

● వైద్య ఖర్చుల కోసం రూ.లక్ష సాయం

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి చికిత్స పొందుతున్న సీనియర్ జర్నలిస్టు కేవీఎస్‌ఎస్ ప్రకాశ్‌కు తెలంగాణ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అండగా నిలిచారు. ప్రకాశ్ చికిత్స కోసం రూ.లక్ష ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. మంత్రి సూచన మేరకు ఈ మొత్తాన్ని ప్రకాశ్ బ్యాంక్ అకౌంట్‌కు పంపిస్తున్నామని ఆయన కార్యాలయం మంగళవారం ప్రకటించింది. ఢిల్లీలో జర్నలిస్టుగా పనిచేస్తున్న ప్రకాశ్ బ్రెయిన్ స్ట్రోక్‌తో 4 రోజుల క్రితం అక్కడే ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. ఢిల్లీ, హైదరాబాద్‌లో పనిచేస్తున్న పలువురు జర్నలిస్టులు మంత్రి దామోదర దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఢిల్లీలో పనిచేస్తున్న పలువురు రిపోర్టర్లతో మంగళవారం మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. ప్రసాద్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. ఆయన చికిత్స కోసం తాను వ్యక్తిగతంగా రూ.లక్ష సాయం చేస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు సర్కార్ అండగా ఉంటుందని, సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఇండ్ల స్థలాలను సమస్యను కూడా ఇటీవలే పరిష్కరించామని మంత్రి గుర్తు చేశారు. జర్నలిస్టు హెల్త్ స్కీమ్ కింద జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

రోజుకో అవతారంతో కొట్టేస్తున్నారు..

పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు..

మల్యాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గతంలో తీసుకున్న రుణం తీరిపోవడంతో కొత్త రుణం కోసం అన్‌లైన్‌లో వచ్చిన యాప్ డౌన్‌లోడ్ చేసుకుని అందులో అడిగినట్లుగా మార్జిన్ డబ్బులు రూ.3లక్షలు చెల్లించారు. ఇంకా కొంత చెల్లిస్తేనే రుణం అందుతుందని మళ్లీ మళ్లీ పోన్ కాల్స్ చేస్తుండడంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మనిదేవునిపల్లి గ్రామానికి చెందిన మరో వ్యక్తి ట్రాక్టర్ ఫైనాన్స్ ఈఎంఐ చెల్లించేందుకు తన బ్యాంకు ఖాతాలో రూ.70వేలు జమ చేశాడు. తన వాట్సాప్ గ్రూపులో వచ్చిన ఎస్‌బీఐ రివార్డ్స్ మెసేజ్‌ను క్లిక్ చేయడంతో తన ఖాతా ఖాళీ అయినట్లు మెసేజ్ వచ్చింది.

మారేపల్లి చెందిన వ్యక్తి కుడా ఇలానే చేసి రూ.32వేలు పోగట్టుకున్నాడు. ప్రైవేటు ఉపాధ్యాయుడు అన్‌లైన్‌లో వచ్చిన ఎలక్ట్రిక్ చార్జింగ్ స్కూటీ లింక్‌తో రూ.24 వేలు చెల్లించి మోసపోయాడు.

● స్మార్ట్ ఫోన్లతో సామాన్యుల చిట్టా సైబర్ నేరగాళ్ల చెంతకు..
● మోసపోయినా అవమానంగా భావించి బయటకు రాని బాధితులు

కొండాపూర్, సెప్టెంబరు 17 : రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతుండడం సామాన్య ప్రజలకు ఆందోళన కలిగిస్తుంది. స్మార్ట్‌ఫోన్ల వినియోగం సామాన్యులకు ఎక్కువగా అందుబాటులోకి రావడంతో సైబర్ నేరగాళ్లకు ఏమాత్రం అవకాశం దొరికినా వీరి ఖాతాలను ఖాళీ చేసేందుకు సిద్ధపడుతున్నారు. ఆన్‌లైన్ లింకుల ద్వారా మోసాలకు పాల్పడుతున్నారు. రుణాలు ఇస్తామని ఆశచూపి మార్జిన్ మనీ పే చేయాలంటూ ట్రాప్ చేస్తున్నారు. ఎక్కువగా ఉన్నత చదువులు చదివిన వ్యక్తులే మోసాలకు గురవుతుండడం గమనార్హం.



అకౌంట్లు హ్యాక్ చేసి..

సోషల్ మీడియాలో వచ్చే మేసేజ్ లింక్స్ షేర్స్, ఐఏఎస్, ఐపీఎస్, స్నేహితుల ట్రూకాలర్ ప్రొఫైల్ ఫొటో, పేర్లు, రిక్వెస్ట్‌లు ఇలా పలు అంశాలకు సంబంధించి కాల్స్ చేస్తూ స్పదించిన వారి నుంచి డబ్బులు కొల్లగొడుతున్నారు. ఒక్క క్లిక్‌తో ఫోన్ హ్యాక్ అయ్యి సైబర్ నేరగాళ్ల చేతిల్లోని ఫోన్‌కు వ్యక్తుల డాటా మొత్తం పోతున్నది. దీంతో సులువుగా బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న డబ్బును దోచేస్తున్నారు. అంతేకాకుండా వాట్సాప్, ఫేస్‌బుక్ హ్యాక్ చేస్తూ ఫోన్ నంబరు ద్వారా సైబర్ నేరగాళ్లు చాటింగ్ చేస్తూ తాను ఆస్పత్రుల్లో ఉన్నాని, డబ్బులు అత్యవసరమని చెబుతున్నారు. ఇది నిజమేనని నమ్మి అవతలి వ్యక్తులు డబ్బులను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఈ క్రమంలో నా ఫోన్ హ్యాక్ అయ్యిందని, నా పేరిట ఎవరూ నగదు అడిగినా ఎంపవద్దని వాట్సాప్ గ్రూపల్లో సందేశాలు పంపడంతో నిజం తెలిగానే మోసాపోయామని గుర్తించి నిస్సహాయంగా ఉండిపోతున్నారు.



వీటి జోలికి పోవద్దు : కొండాపూర్ సీఐ చంద్రయ్య



కేవైసీ అప్‌డేట్.. ఫలానా యాప్ డౌన్‌లోడ్ అంటూ వచ్చి లింక్‌ల జోలికి వెళ్లకూడదు. ఆన్‌లైన్ రుణాలు, లక్షల్లో లాటరీల కోసం నగదు చెల్లించాలంటే నమ్మొద్దు.మైక్రో ఫైనాన్స్, రుణ యాప్‌లను డౌన్‌లోడ్ చేయకూడదు. ఆన్‌లైన్ వస్తువల కొనుగోలులో నమ్మకమైన యాప్‌లను ఆశ్రయించాలి. సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ప్రతి మెసేజ్‌ను క్షుణంగా చదివి అవతలి వ్యక్తి సమాచారాన్ని పూర్తిగా తెలుసుకొని స్పందించాలి.సైబర్ నేరాలు నియంత్రణకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.


సంగారెడ్డిలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో జాతీయ జెండా ఎగురవేస్తున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు


పటాన్‌చెరు: ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


బొల్లారం మున్సిపల్ కార్యాలయం వద్ద జెండాను ఎగురవేసిన చైర్ పర్సన్ రోజారాణి


రామచంద్రాపురం: తెల్లాపూర్ జాతీయ పతాకాన్ని ఎగురవేసిన మున్సిపల్ చైర్‌పర్సన్

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో మంగళవారం ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయతీ కార్యాలయాల, పాఠశాలల వద్ద అధికారులు, ప్రజా ప్రతినిధులు జాతీయ జెండాను ఎగురవేశారు. సంగారెడ్డిలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు జావిద్‌అలీ, తారా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ డా.అనీల్‌కుమార్ జాతీయ జెండాలను ఎగురవేశారు. పటాన్‌చెరు మండల పరిషత్తు, జీహెచ్‌ఎంసీ కార్యాలయాల వద్ద నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. జిన్నారంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద డిప్యూటీ తహసీల్దార్ పరమేశ్వర్ జాతీయ జెండాను ఎగురవేశారు. బొల్లారంలో మున్సిపల్ కార్యాలయం వద్ద చైర్‌పర్సన్ రోజారాణి జాతీయ జెండాను ఎగురవేశారు. రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపల్ నూతన కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.లలితాసోమిరెడ్డి జాతీయ పథాకాన్ని ఆవిష్కరించారు. నారాయణఖేడ్‌లోని ఇందిరా చౌక్ వద్ద ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, మున్సిపల్ కార్యాలయం ముందు చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, ఆర్డీవో కార్యాలయం ఆవరణలో ఆర్డీవో అశోక చక్రవర్తి , వివిధ కార్యాలయాల వద్ద సంబంధిత అధికారులు జాతీయజెండాలను ఎగురవేశారు. జహీరాబాద్‌లోని మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ రవీందర్ జాతీయజెండా, వ్యవసాయ మార్కెట్‌కమిటీ కార్యాలయం వద్ద మార్కెట్ చైర్మన్ ఆగమసాయిచరణ్ జెండాను ఎగురవేశారు. మెదక్ పట్టణంలోని స్థానిక రాందాస్ చౌరస్తాలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు జాతీయ జెండాను ఎగురవేశారు. తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం వద్ద చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ, రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద ఆర్డీవో జయచంద్రారెడ్డి, పోలీసు సబ్ డివిజన్ కార్యాలయం వద్ద డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సర్కిల్ కార్యాలయం వద్ద సీఐ రంగ కృష్ణ, పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద డీఈఈ శ్రీనివాస్‌రెడ్డిలు జాతీయ జెండాలను ఎగురవేశారు. నర్సాపూర్‌లోని ఆర్డీవో కార్యాలయం వద్ద ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, మండల పరిషత్ వద్ద ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రావు, మున్సిపల్ వద్ద చైర్మన్ అశోక్‌గౌడ్, సర్కిల్ కార్యాలయం వద్ద సీఐ జాన్‌రెడ్డి, తహసీల్ కార్యాలయం వద్ద తహసీల్దార్ కె.శ్రీనివాస్ తదితరులు జెండావిష్కరించారు.


నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయం వద్ద జెండా ఎగురవేసిన ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి


నారాయణఖేడ్‌లో జాతీయ జెండా ఎగుర వేసి గౌరవ వందనం చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి


జహీరాబాద్: మున్సిపల్ కార్యాలయం వద్ద జెండాను ఎగురవేసిన కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి


మెదక్ అర్బన్‌రాందాస్ చౌరస్తాలో జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు


తూప్రాన్: ఆర్డీవో కార్యాలయం వద్ద జెండాను ఎగురవేసి వందనం చేస్తున్న ఆర్డీవో, అధికారులు

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

చేగుంట, సెప్టెంబరు 17: ప్రమాదవశాత్తు చెరువులో జారి పడిన వృద్ధురాలిని స్థానికులు రక్షించి అసుపత్రికి చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని పెద్ద శివునూర్ గ్రామంలో మంగళవారం జరిగింది. చేగుంట ఎస్‌ఐ చైతన్యరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... పెద్ద శివునూర్ గ్రామానికి చెందిన తలారి పోచవ్వ(83) ఇంటి సమీపంలో గల మొగుళ్ల చెరువు వద్దకు ఈ నెల 15న కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో జారిపడగా స్థానికులు రక్షించి తూప్రాన్ ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గాంధీ అసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అసుపత్రిలో మంగళవారం తెల్లవారు జామున మృతి చెందారు. మృతురాలి మనుమడు తలారి మహేష్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు వెల్లడించారు.

కొంతాన్‌పల్లిలో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం


ధ్వంసమైన విగ్రహం

శివ్వంపేట, సెప్టెంబరు 17: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు అవమానం జరిగింది. గుర్తు తెలియని దుండగులు అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడంతో నిందితులను కఠినంగా శిక్షించాలని విగ్రహం వద్ద స్థానికులు ఆందోళనకు దిగారు. ఈ ఘటన కొంతాన్‌పల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని కొంతాన్‌పల్లిలో అంబేద్కర్ విగ్రహం కుడి చేయి ధ్వంసం చేశారని తెలిపారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరుతూ స్థానికులు డిమాండ్ చేశారు.

నిమజ్జనాన్ని పర్యవేక్షించిన కలెక్టర్, మల్టీజోన్ ఐజీ

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 17: సంగారెడ్డిలోని మహబూబ్‌సాగర్ చెరువు వద్ద ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన శోభాయాత్ర తీరును జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, మల్టీ ఐజీ వి.సత్యనారాయణలు మంగళవారం రాత్రి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమజ్జనం సాఫీగా కొనసాగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ రూపేష్‌తో పాటు జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అదనపు ఎస్పీ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్

రామచంద్రాపురం, సెప్టెంబరు 17: తెల్లాపూర్ మున్సిపాలిటీలో వచ్చిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల విచారణను మంగళవారం మున్సిపల్, రెవెన్యూ అధికారులతో కలిసి అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రశేఖర్ పరిశీలించారు. దరఖాస్తుదారుల స్థలాల వరకు వెళ్లి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. వినాయక నిమజ్జన సందర్భంగా మేళ్ల చెరువుపై ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో కమిషనర్ సంగారెడ్డి, ఆర్‌ఐ శ్రీకాంత్, ఏఈ మోనిక ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అత్యధిక సభ్యత్వాలతో సత్తా చాటాలి: బీబీపాటిల్

నారాయణఖేడ్, సెప్టెంబరు 17: బీజేపీ సభ్యత్వ నమోదులో భాగంగా అత్యధిక సభ్యత్వాలు చేయించి సత్తా చాటాలని జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీపాటిల్, పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఖేడ్‌లో మంగళవారం బీజేపీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. కార్యకర్తలకు తాను అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా, స్థానిక నాయకులు సీనియర్ న్యాయవాది బస్వరాజ్‌పాటిల్, అరుణ్‌రాజ్‌శేరికార్, బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర నాయకులు రాజురాథోడ్, జిల్లా ఉపాధ్యక్షులు పత్రిరామక్రిష్ణ, నాయకులు పాల్గొన్నారు. నారాయణఖేడ్ పట్టణ శివార్లలోని జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ మంగళవారం నీలేష్ మాత ఆశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం సరికాదు

సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు సరికాదు

● జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటిమాణిక్‌రావు

జహీరాబాద్,సెప్టెంబరు 17: తెలంగాణ సచివాలయం ఎదుట దివంగత ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసేల కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరికాదని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతు తెలంగాణ తల్లిని అవమానించేలా కాంగ్రెస్ వ్యవహరిస్తున్న తీరును ఆయన తప్పుపట్టారు. రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటును తామంతా వ్యతిరేకిస్తున్నామన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్‌జయశంకర్‌తోపాటు తెలంగాణలో ఎంతో మంది మేధావుల విగ్రహాలు పెట్టకపోవడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. అనంతరం తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. క్యాంపుకార్యాలయంలో కోహీర్‌మండలానికి చెందిన 11మంది లబ్ధిదారులకు రూ.3.73 లక్షల విలువచేసే సీఎం సహాయనిధి చెక్కులను పలువురు లబ్ధిదారులకు అందజేశారు. అలాగే పట్టణంలో కొనసాగుతున్న వినాయవిగ్రహాల శోభయాత్రను, ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

పోరాట యోధులకు సీపీఎం నివాళులు

మునిపల్లి, సెప్టెంబరు 17: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులకు మంగళవారం నాడు సీపీఎం మండల నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకుడు రమేష్ గౌడ్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తికోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాటం చేసి మరణించిన 4500మంది ఉద్యమకారులు, సమరయోధులకు జోహార్లు అర్పిస్తున్నట్లు తెలిపారు. వీర తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో మన హక్కుల కోసం ప్రజలందరూ చైతన్యంతో ముందుకు సాగాలనిఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

● చేగుంట, సెప్టెంబరు 17: తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులని సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ నాయకులు భూపాల్ అన్నారు. చేగుంట మండలం పోలంపల్లి గ్రామ శివారులోని కేవల్ కిషన్ సమాధి వద్ద మంగళవారం సీపీఎం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవ సభ జిల్లా కార్యదర్శి మల్లేశం అధ్యక్షతన జరిగింది. సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ నాయకులు భూపాల్ మాట్లాడారు. వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా చదువుకున్న మేధావులతో పాటు చిట్యాల ఐలమ్మ, తమ భూమిని కార్మిక వర్గాన్ని ప్రజలను ఐక్యం చేసి భూస్వాముల దొరలను పోరాడి ఓడించిన చరిత్ర సీపీఎం పార్టీదేనని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు నర్సమ్మ, బాలమణి, బస్వరాజు, సంతోష్ ఉన్నారు.


చేగుంట: పోలంపల్లిలో కేవల్ కిషన్ సమాధి వద్ద జెండా ఎగురవేస్తున్న దృశ్యం

శేఖాపూర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

జహీరాబాద్,సెప్టెంబరు 17: మండల పరిధిలోని శేఖాపూర్ గ్రామంలోగల దర్గాలో మాజీ మంత్రి డా. చంద్రశేఖర్ మంగళవారం ప్రత్యేక ప్రార్ధనలు చేసి దర్శనం చేసుకున్నారు. ముందుగా గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం దర్గాలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొన్నారు. అలాగే తెలంగాణ విమోచనదినోత్సవం సందర్భంగ పట్టణంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయం వద్ద జాతీయజెండాను ఎగురవేశారు.

మార్డిలో స్థలాల పరిశీలన

కల్హేర్, సెప్టెంబరు 17: మండల పరిధిలోని మార్డి గ్రామంలో 1999 సంవత్సరంలో ఎస్సీలకు కేటాయించిన నివాస స్థలాలను కల్హేర్ తహసీల్దార్ శివశ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. సర్వే నంబర్ 10లో 74 మందికి అప్పటి ఎమ్మెల్యే పి. కిష్టారెడ్డి కృషితో ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. కానీ నేటి వరకు వారికి స్థలాలు కేటాయించలేదు. తహసీల్దార్‌తో స్థలాలను పరిశీలించి సర్వే అనంతరం లబ్ధిదారులకు కేటాయిస్తారన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

వెల్దుర్తి, సెప్టెంబరు 17: రాష్ట్ర బాల్ స్వస్థ కార్యక్రమంలో భాగంగా డాక్టర్లు సంగీత, వెంకటేష్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 412 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 19 మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉందని వైద్యులు గుర్తించి వారికి అద్దాలను పంపిణీ చేసినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య తెలిపారు. కంటి వైద్య నిపుణులు జి. వీర్‌కుమార్, ఏఎన్‌ఎం మమత, తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ జయంతిని కార్మిక దినంగా నిర్వహించాలి


సంగారెడ్డిలో విశ్వకర్మ జయంతి వేడుకల్లో బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రదీప్, నాయకులు


పెద్దశంకరంపేటలో స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

సంగారెడ్డి అర్బన్/జిన్నారం, సెప్టెంబరు 17 : కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం సెప్టెంబరు 17న విశ్వకర్మ జయంతిని కార్మిక దినంగా అధికారికంగా నిర్వహించాలని బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని బీఎంఎస్ జిల్లా కార్యాలయంలో మంగళవారం విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, కార్యదర్శి మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రభు, విజయ్, అంజయ్య జనార్దన్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, గణపతి, లక్ష్మణ్ పాల్గొన్నారు. జిన్నారం విశ్వకర్మ భవనంలో భగవాన్ విశ్వకర్మకు ఘనంగా పూజలు నిర్వహించారు. బొల్లారంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ధ్యాన మందిరంలో భగవాన్ విశ్వకర్మ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు జరిపారు.

మెదక్ జిల్లాలో ఘనంగా జయంతి వేడుకలు

మెదక్ అర్బన్/ చిన్నశంకరంపేట/నిజాంపేట/రేగోడు/అల్లాదుర్గం/పెద్దశంకరంపేట/పాపన్నపేట/నర్సాపూర్/మనోహరాబాద్/వెల్దుర్తి, సెప్టెంబరు 17: కలెక్టరేట్‌లో నిర్వహించిన విశ్వకర్మ జయంతి వేడుకల్లో రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, కలెక్టర్, ఎస్పీలతో కలిసి విశ్వకర్మ చిత్రపటానికి పూల మాలలు వేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. చిన్నశంకరంపేట శివారు రాధ స్టెటల్ స్టీల్ పరిశ్రమలో మంగళవారం ఆయుధ పూజలు ఘనంగా నిర్వహించారు. నిజాంపేటలోని బ్రహ్మంగారి ఆలయం వద్ద బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ విశ్వకర్మ వృత్తిదారులతో కలిసి జెండా ఎగరవేసి పూజలు నిర్వహించారు. రేగోడు బ్రహ్మంగారి మఠంలో ప్రత్యేక పూజలతో పాటు విశ్వకర్మ జెండావిష్కరణ చేశారు. అల్లాదుర్గంలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో విశ్వకర్మ జెండాను ఆవిష్కరించి ఆయన చిత్రపటానికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. పెద్దశంకరంపేటలోని స్వర్ణకార సంఘం భవనంలో ప్రత్యేక హోమం, పూజలు నిర్వహించారు. అనంతరం స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. పాపన్నపేట మండలంలోని విశ్వకర్మ నాయకులు, ఉదయం విశ్వకర్మ జెండా ఆవిష్కరించారు .అనంతరం పాతూరులోని వేంకటేశ్వర ఆలయంలో హోమం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నర్సాపూర్ మండలంలోని పెద్దచింతకుంట సమీపంలోని విశ్వకర్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు,హోమం నిర్వహించారు. అంతకు ముందు నర్సాపూర్‌లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, బీజేపీ కౌన్సిలర్లు, విశ్వకర్మ సంఘం నాయకులు పాల్గొన్నారు. మనోహరాబాద్ వెల్దుర్తి లో విశ్వకర్మకు పూజలు నిర్వహించారు.

తెలంగాణ తల్లిని అవమానించిన కాంగ్రెస్

● సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్


సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోని సమావేశంలో మాట్లాడుతున్న చింతా ప్రభాకర్

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 17: తెలంగాణ తల్లిని అవమానించేలా కాంగ్రెస్ నిర్ణయాలు తీసుకుంటుందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ధ్వజమెత్తారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సచివాలయం ముందు రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి తెలంగాణ అస్తిత్వాన్ని తాకట్టు పెట్టి సిగ్గుమాలిన పని చేసిందన్నారు. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని పెట్టుకుంటే అభ్యంతరం లేదని, కానీ తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ రోజు కాంగ్రెస్ చేసిన పనికి ప్రతి తెలంగాణ బిడ్డ మనసును గాయపర్చిందని అన్నారు. రేవంత్‌రెడ్డి తాను చేసిన తప్పును సరిదిద్దుకోవాలని, లేనిపక్షంలో తెలంగాణ ప్రజలు సరైన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

●తూప్రాన్: తూప్రాన్ పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి పట్టణ అధ్యక్షుడు సతీష్‌చారి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాచిరెడ్డి కృష్ణారెడ్డి, పల్లె ప్రభాకర్ రెడ్డి, సత్తార్, బురాన్, మన్నె శ్రీనివాస్‌రావు, అనిల్, నాని, నరేష్, బాలేష్ తదితరులు పాల్గొన్నారు.

●టేక్మాల్: టేక్మాల్ చౌరస్తా తెలంగాణ తల్లి చిత్రపటానికి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బీరప్ప, నాయకులు పాలాభిషేకం నిర్వహించారు.

●మనోహరాబాద్: మనోహరాబాద్ మండలంలోని కూచారం గ్రామంలో తెలంగాణ తల్లి విగ్రహానికి ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు నరేష్ ముదిరాజ్, ఉద్యమకారుడు మాంగ్యనాయక్, వీరేష్‌గౌడ్‌తో కలిసి తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయంలో రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడం సిగ్గుచేటన్నారు.

పలు గ్రామాల్లో 'స్వచ్ఛతా హీ సేవ'

తూప్రాన్/చిలప్‌చెడ్/కంది/రామచంద్రాపురం/కంగ్టి, సెప్టెంబరు 17: తూప్రాన్ మున్సిపాలిటీ కార్యాలయం వద్ద స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ప్రారంభించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయ అవరణలో వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్‌తో కలిసి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. చిలప్‌చెడ్ మండలం పరిధిలోని ఫైజాబాద్ గ్రామంలో మంగళవారం ఎంపీడీవో ఆనంద్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ నిర్వహించారు. ఉన్నత పాఠశాల విద్యార్థులచే గ్రామంలోని పలు వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కంది మండలంలోని చేర్యాల, కవలంపేట, జుల్కల్, ఎద్దు మైలారం, ఇంద్రకరణ్ గ్రామాల్లో మొక్కలను నాటారు. రామచంద్రాపురం మండలంలో మున్సిపల్ కార్యాలయం నుంచి ఇంద్రానగర్ సాయిబాబ టెంపుల్, గద్దర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కంగ్టి మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని అధికారులు అట్టహాసంగా ప్రారంభించారు. డీఎల్పీవో సంజీవ్‌రావు, ఎంపీడీవో సత్తయ్య, ఎమ్మార్వో విష్ణుసాగర్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పరుపులు పంపిణీ

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 17: మండల కేంద్రానికి చెందిన వృద్ధులు, దివ్యాంగులకు మాజీ సర్పంచ్ రాజిరెడ్డి ఆధ్వర్యంలో శ్రీమాని ఫోమ్ పరిశ్రమ సౌజన్యంతో సీఆర్‌ఎస్ నిధులతో పరుపులను పంపిణీ చేశారు. మంగళవారం రాదేశ్యాం పంక్షన్‌హాల్‌లో పరిశ్రమ ప్రతినిధులు వందమందికి అందజేశారు. పరిశ్రమ హెచ్‌ఆర్ పృథ్వీరాజ్, సిబ్బంది భవానీశంకర్, రామకృష్ణ, నాయకులు రమేష గౌడ్ తదితరులు ఉన్నారు.


వృద్ధురాలికి పరుపును అందజేస్తున్న దృశ్యం

మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి


పెద్దశంకరంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

పెద్దశంకరంపేట/టేక్మాల్/అల్లాదుర్గం/నర్సాపూర్, సెప్టెంబరు 17: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. మోదీ జన్మదినం సందర్భంగా మంగళవారం పెద్దశంకరంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో విఠల్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. టేక్మాల్‌లో మోదీ జన్మదిన వేడుకలను బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల మల్లిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు నవీన్‌గుప్తా, నాయకులు అశోక్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. మోదీ జన్మదినం సందర్భంగా అల్లాదుర్గంలోని పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మోదీ జన్మదినం సందర్భంగా నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో బీజేపీ నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్, పాల్గొన్నారు.

విమోచన దినాన్ని అధికారికంగా ఎందుకు నిర్వహించడం లేదు?


రామచంద్రాపురం:రోగులకు పండ్లను పంపిణీ చేస్తున్న గోదావరి అంజిరెడ్డి

సంగారెడ్డి అర్బన్ /రామచంద్రాపురం/జహీరాబాద్: , సెప్టెంబరు 17 : విమోచన దినాన్ని ఎందుకు అధికారికంగా నిర్వహించడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సంగారెడ్డిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆమె జాతీయ జెండా ఎగురవేశారు. నిజాం నిరంకుశపాలనపై పోరాడిన సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాల్సిన రోజు విమోచన దినమని ఆమె గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అంజిరెడ్డి, రమేశ్, దేశ్‌పాండే పాల్గొన్నారు. రామచంద్రాపురంలో బీజేపీ కార్యాలయంపై జిల్లా అధ్యక్షురాలు సి.గోదావరి అంజిరెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు ఎడ్ల రమేష్‌తో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తెల్లాపూర్‌లో మల్లెపల్లి రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో విమోచన దినోత్సవాన్ని నిర్వహించారు. జహీరాబాద్‌లోని బీజేపీ కార్యాలయం వద్ద బీజేపీ నాయకులు జెండాను ఎగురవేశారు.

మెదక్ జిల్లాలో..

మెదక్ అర్బన్/తూప్రాన్/పెద్దశంకరంపేట/హవేళిఘణపూర్/చిన్నశంకరంపేట, సెప్టెంబరు 17: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం పట్టణ అధ్యక్షుడు ప్రసాద్ ఆధ్వర్యంలో ఖిల్లాపై జాతీయ పథకాన్ని ఎగరవేశారు. తూప్రాన్ పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినం, ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. తూప్రాన్ పట్టణంలోని మహంకాళి ఆలయం వద్ద జాతీయ జెండాను పట్టణ అధ్యక్షుడు జానకిరాంగౌడ్ జాతీయ జెండాను ఎగురవేశారు. పెద్దశంకరంపేటలోని బీజేపీ కార్యాలయం వద్ద బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్ జాతీయ జెండాను ఎగుర వేశారు. హవేళిఘణపూర్ బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేశారు.చిన్నశంకరంపేటలోని బీజేపీ కార్యాలయం ఎదుట బీజేపీ మండలాధ్యక్షుడు రాజు జాతీయ జెండాను ఎగరవేశారు.